# టైటిల్ ఆర్సీబీదే

హైదరాబాద్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) నిలిచింది. నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, వరుసగా రెండోసారి ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (75 నాటౌట్; 42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లు) అద్భుతమైన అర్ధశతకంతో జట్టును ముందుండి నడిపించి విజయతీరాలకు చేర్చాడు. 156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు విరాట్ కోహ్లీ, వెంకటేశ్ అయ్యర్ (32; 16 బంతుల్లో) అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. పవర్‌ప్లేలో వీరిద్దరూ కేవలం 4.3 ఓవర్లలోనే 62 పరుగులు జోడించారు. ఆ తర్వాత స్వల్ప వ్యవధిలో వికెట్లు కోల్పోయి కాస్త తడబడినప్పటికీ, ఒకవైపు విరాట్ కోహ్లీ క్రీజులో పాతుకుపోయి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. టిమ్ డేవిడ్ (24) కీలక సమయంలో రాణించాడు. చివరి వరకు క్రీజులో నిలిచిన కోహ్లీ, 18వ ఓవర్‌లో అర్షద్ ఖాన్ బౌలింగ్‌లో సిక్సర్ బాది జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఇంకా 12 బంతులు






మిగిలి ఉండగానే ఆర్సీబీ లక్ష్యాన్ని ఛేదించింది. అంతకుముందు, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ, కట్టుదిట్టమైన బౌలింగ్‌తో గుజరాత్‌ను సాధారణ స్కోరుకే పరిమితం చేసింది. గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. వాషింగ్టన్ సుందర్ (50 నాటౌట్; 37 బంతుల్లో) ఒంటరి పోరాటం చేసి అర్ధశతకంతో ఆదుకున్నాడు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ దార్ 3 వికెట్లతో సత్తా చాటగా, భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో ఆర్సీబీ, ఆ జట్టు కెప్టెన్ రజత్ పటీదార్ అరుదైన ఘనత సొంతం చేసుకోవడం విశేషం. ఆర్సీబీ ఈ విజయంతో... వరుసగా రెండు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్ల సరసన చేరింది. కెప్టెన్ గానూ రజత్ పటీదార్ వరుసగా రెండు టైటిళ్లతో రికార్డు పుటల్లోకెక్కాడు.

# అమెరికాతో రాజీ పడే ప్రసక్తే లేదు

మొదటి తరువాయి

లేదా శత్రుత్వానికి ముగింపుగా భావిస్తారా అనేది తెలియడం లేదు. ఎంఓయూను కేవలం ఒకే పేజీలో పొందుపరిచారు. దీనిలో దాదాపు డజను అంశాలు మాత్రమే ఉన్నాయి. అయినప్పటికీ అది అంత తేలికగా తేలే విషయంగా కన్పించడం లేదు.

ట్రంప్ తాజా డిమాండ్లతో పరిస్థితి జటిలం

'వారు ఏయే అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నారో, తొలి దశలో ఏ మేరకు రాయితీలు ఇవ్వడానికి సుము ఖంగా ఉన్నారో స్పష్టంగా తెలియాల్సి ఉంది. అప్పుడే దౌత్య పరి ష్కారం సాధ్యపడుతుంది' అని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఇటీవల చెప్పారు. ప్రస్తుతం అమలులో ఉన్న కాల్పుల విరమణను దీర్ఘకాలిక పరిష్కారంగా మార్చే విష యంపై ఇరుపక్షాలు తాత్కాలికంగా ఒప్పందానికి వచ్చాయని అమెరికా అధికారులు తెలిపారు. అయితే రెండు రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక డిమాండ్లను తెర పైకి తీసుకురావడంతో పరిస్థితి జటిలంగా మారింది. హోర్ముజ్ జలసంధిని తెరవాలని, ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని నిలిపివేయాలని ఆయన కోరుతున్నారు. దీనికి ఇరాన్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విదేశాలలో స్తంభింపజే సిన తన ఆస్తులను తక్షణమే విడుదల చేయాలని ఇరాన్ పట్టుబడుతుండగా ట్రంప్ దానిపై పెదవి విప్పడం లేదు. అమెరికా డిమాండ్లు వాస్తవానికి అభ్యర్థనలేనని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై వ్యాఖ్యానించారు. ఏదేమైనా ఎంఓయూపై చర్చలు మాత్రం ఇంకా పురోగతిలోనే ఉన్నాయని తెలుస్తోంది.

హోర్ముజ్‌పై...

హోర్ముజ్ జలసంధిలో మూడు నెలలుగా వాణిజ్య నౌకల రాకపోకలు స్తంభించిపోవడంతో ముడి చమురు, నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ముందుగా నౌకాయానంపై ఒప్పందానికి రావాలని ఇరు పక్షాలు భావిస్తున్నాయి. జలసంధిని వెంటనే తెరవాలని, ఎలాంటి సుంకాలు-నియంత్రణలు లేకుండా నౌకాయానాన్ని అనుమతించాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. జలసంధిలో అమర్చిన మందుపాతరలను తొలగించాల్సిన బాధ్యత ఇరాన్‌దేనని కూడా ఆయన అంటున్నారు. అదే సమయంలో ఇరాన్ ఓడరేవుల దిగ్బంధాన్ని ఎత్తివేస్తామని చెప్పారు. అయితే ఒమన్‌తో కలిసి అంతర్జాతీయ జలమార్గం మీదుగా నౌకల రాకపోకలను పర్యవేక్షించే హక్కు తనకు ఉన్నదని ఇరాన్ అంటోంది. హోర్ముజ్‌లో ఒమన్ ప్రమేయాన్ని వ్యతిరేకించడంతో పాటు దానికి ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నారు. హోర్ముజ్‌లో ఇరాన్ నియంత్రణలు, ఏర్పాట్లు స్వభావరీత్యా శాశ్వతమైనవని, అవి తాత్కాలికమైనవేమీ కావని పార్లమెంటుకు చెందిన జాతీయ భద్రతా కమిషన్ అధిపతి ఇబ్రహిం అజిజి స్పష్టం చేశారు.

# భారత దేశ చరిత్రలోనే అతిపెద్ద గృహ విప్లవం

మొదటి తరువాయి

అవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇప్పుడు కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాకుండా పేద కుటుంబాల జీవితాలను మార్చేస్తున్న సామాజిక ఉద్యమంగా మారిందని అన్నారు. స్వతంత్ర భారత చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సలహాలు సూచనల మేరకు భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టి తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా ఇళ్లను మంజూరు చేశామని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. నేడు జూన్ 1న ఆసిఫాబాద్ జిల్లా కరమెర మండలం కోశారి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రెండవ విడతకు శ్రీకారం చుట్టబోతున్నామని ప్రకటించారు. అలాగే కొత్తగూడెంలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్ల మంజూరుతో రెండు విడతల్లో కలిపి ఒక్కో నియోజకవర్గానికి 5500 నుంచి 6,500 ఇళ్లను మంజూరు చేసినట్టు అవుతుందన్నారు. ఐటిడిఎ ప్రాంతాల్లోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 1500 వరకు మంజూరు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. తాము ఆశించిన స్థాయిలో మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం విజయవంతమైందని గత ఏడాది ఫిబ్రవరి మూడవ వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారని, ఈ 13 నెలల్లో లక్ష ఇళ్లను పూర్తి చేసుకొని మరో ఒకటి రెండు నెలల్లో మరో రెండు లక్షల ఇళ్లు పూర్తికాబోతున్నాయని తెలిపారు. ఇది పక్కాగా చూసినా దేశానికే ఆదర్శవంతంగా ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ ఏడాది 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను క్యూఆర్ పరిధిలో లక్ష ఇళ్లకు రాష్ట్రం లోని ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల మొత్తం 3.50 లక్షల ఇళ్లకు మంజూరుకు పరిపాలనా అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ఒక ప్రణాళిక బద్ధంగా మొదటి విడతలో ఎదురైన మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని మరింత పటిష్టంగా రెండో విడత కార్యక్రమాన్ని అమలు చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. దేశంలోని చాల రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పరిమిత నిధులతో గృహ నిర్మాణాలను కొనసాగిస్తున్నప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం మాత్రం పేదవాడి ఇల్లు -- ప్రభుత్వ బాధ్యత అనే లక్ష్యంతో స్వంత నిధులతో ముందుకు సాగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రం కేవలం రూ.72 వేలే, పట్టణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు మాత్రమే ఇస్తున్నా, తెలంగాణ ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. స్వర్గీయ వైఎస్ రాజశేఖరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి 2013 వరకు అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్లు మంజూరై, ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి, 2023 లో గృహ లక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరై ఇప్పటికీ పూర్తి చేసుకోలేకపోయిన వారికి రెండవ విడతలో ఆ ఇంటి నిర్మాణం పూర్తి అవడానికి అవసరమయ్యే ఆర్థికసాయాన్ని అందిస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అనాది కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపట్టిన ఇందిరమ్మ పథకంలో 20వేల రూపాయల వరకు ఆర్థికసాయం పొందినవారికి కూడా ఈ విడతలో ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

# సంక్షేమంలో సింగరేణి సరికొత్త అధ్యాయం

- కార్మిక కుటుంబాలకు రక్షణ కవచం కోటి రూపాయల ప్రమాద బీమా
- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో అమలైన పథకంతో 45 కుటుంబాల్లో వెలుగు
- దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్ర సంక్షేమ చర్య-నేడు దేశ వ్యాప్తంగా విస్తరణ
- సింగరేణిలో ఇప్పటికే సుమారు 41 కోట్ల రూపాయల బీమా సొమ్ము చెల్లింపు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి

ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు నాగుల రాజయ్య. ఆయన ఒక కొడుకు, ఒక కుమార్తె. సింగరేణిలో కార్మికుడిగా నియమకం ద్వారా ఆయన కుమారుడు సంతోష్ ఉద్యోగంలో చేరాడు. కానీ రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు సంతోష్‌ను కబళించింది. ఆయన సింగరేణిలో చేరి కూడా కేవలం 18 నెలలు మాత్రమే. తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న రాజయ్య కుటుంబానికి ఆయన కుమారుడు సంతోష్ ఏకైక దిక్కు. సంతోష్ పనిచేసిన 18 నెలల సర్వీసుకు వచ్చే టెర్మినల్ బెనిఫిట్స్ కూడా చాలా తక్కువ. ఇలాంటి పరిస్థితుల్లో దిక్కుతోచని స్థితిలో ఉన్న రాజయ్య కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చొరవతో సింగరేణిలో ప్రారంభించిన రూ.కోటి ప్రమాద బీమా పథకమే ఓ పెద్దకొడుకు ఆదుకుంది. అనారోగ్యంతో బాధపడుతున్న రాజయ్య వృద్ధ దంపతులకు ప్రస్తుతం ఆర్థికభరోసాగా మారింది. ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు పెండ్లి లత. ఈమె భర్త రంజిత్ కుమార్. సింగరేణిలో పనిచేసేవాడు. పుట్టిన నెల రోజుల కొడుకును చూసి రావడానికి వెళ్లి వస్తూ ఆయన ప్రమాదవశాత్తు



మరణించాడు. ఆయనకు తండ్రి కూడా లేడు. దీంతో ఆయనపైన ఆధారపడిన భార్య లత, తల్లి, నెల రోజుల కుమారుడు ఒంటరివయ్యారు. అయితే ఆయనకు సింగరేణిలో ఒప్పందం ఉన్న బ్యాంక్ లో శాలరీ ఖాతా ఉండటంతో వారికి కోటి రూపాయలు బ్యాంకు నుంచి వచ్చాయి.. ఈ చెక్కును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖామాత్యులు శ్రీ భట్టి విక్రమార్క మల్లు స్వయంగా అందజేశారు. దూరమైన తన భర్తను తిరిగి తీసుకురాలేపోయినా... ఆయన నెరవేర్చే బాధ్యతను ఈ సొమ్ము ద్వారా తీర్చగలిగే అవకాశం కలిగిందని, తనకు, తన కుమారుడి భవిష్యత్తు ఇది ఎంతో దోహదపడుతుందని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. తనకు కూడా అమ్మానాన్న లేరని, ఈ పథకం లేకపోతే తమ కుటుంబం, కుమారుడి భవిష్యత్తు అంధకారమయ్యేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రెండు కుటుంబాల విషయమే కాదు. గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చొరవతో సింగరేణి లో ప్రవేశపెట్టిన ఉచిత ప్రమాద బీమా పథకం ద్వారా ఆర్థిక భరోసాను పొందిన 40 మందికి పైగా కుటుంబాల మనోగతం. ఇప్పుడు ఇది సింగరేణిలోనే కాదు దేశ వ్యాప్తంగా లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ చర్య. ప్రమాదాల వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా కుంగిపోయి భిన్నాభిన్నం అయ్యే పరిస్థితుల్లో చిక్కుకున్న జీవితాలకు భరోసాగా నిలుస్తోంది. ఉచిత ప్రమాద బీమా పథకం. రూపాయి ప్రీమియం చెల్లించకుండానే ఉద్యోగులకు, పొరుగు సేవల సిబ్బందికి సింగరేణిలో అమలవుతున్న ప్రమాద బీమా పథకం పై ప్రత్యేక కథనం. కార్మిక సంక్షేమానికి పెద్ద పీట వేయాలి అన్న రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి యాజమాన్యం దేశంలో తొలిసారిగా 1.25 కోట్ల రూపాయల ప్రమాద బీమా పథకాన్ని సింగరేణి సంస్థలో అమలు చేసింది. 2024లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుల చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పథకం ఇప్పుడు దేశవ్యాప్తంగా బీమా రంగంలో ఒక విశ్వవ్యాప్త చర్చగా మారింది. బొగ్గు కంపెనీలతో పాటు, ఇతర సంస్థలు కూడా ఈ ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయడానికి సింగరేణి సంస్థ స్ఫూర్తిగా నిలిచింది.

# ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో రేవంత్ భేటీ

మొదటి తరువాయి



ఎస్ఐఆర్ ను తెలంగాణలో ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న విషయంపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాల పురోగతిని, బడ్జెట్ ప్రతిపాదనలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఖర్గేకు వివరించారు. రాష్ట్రంలో పార్టీ క్యాడర్ ను బలోపేతం చేయడం, ప్రభుత్వ పార్టీ సమన్వయాన్ని మరింత పటిష్టం చేయడంపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే కేబినెట్ విస్తరణ, కొందరు మంత్రుల మార్పు, పోర్ట్ ఫోలియోల మార్పు విషయాలపై చర్చలు జరుగుతున్నాయి. ఈ వారంలోనే రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తో కూడా ఈ అంశంపై చర్చించి.. జూన్ రెండోవారంలో కేబినెట్ విస్తరణ చేపడతారని తెలుస్తోంది.

# ఆర్టీసీని బలోపేతం చేస్తాం

మొదటి తరువాయి

వాటిని వేగవంతం చేసి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు కనెక్టివిటీని మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలనే డిమాండ్ పెరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలు ప్రక్రియ కూడా కొనసాగుతోందని, ప్రజా రవాణా వ్యవస్థలో ఆర్టీసీని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్మికులకు ఉన్న అపోహలను తొలగించుకోవాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో ఐదుగురు మంత్రులు, సీనియర్ అధికారులు, 40 మంది ఆర్టీసీ ప్రతినిధులతో చర్చలు జరిపి కార్మికులకు 11 శాతం పీఆర్సీ మంజూరు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నామని, ఎన్నికైన ప్రతినిధులతో చర్చించి భవిష్యత్తులో ఆర్టీసీ విలీన ప్రక్రియను చేపడతామన్నట్లు స్పష్టం చేశారు. విలీన ప్రక్రియలో ఎలాంటి వివాదాలు, అడ్డంకులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, కార్మికులు అనవసర ఆందోళన చెందవద్దని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### మరో పది రోజుల్లో తెలంగాణకు

# నైరుతి రుతుపవనాలు!

మొదటి తరువాయి

రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఎండల తీవ్రత తగ్గి, వర్షాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం కేరళ, దాని పరిసర ప్రాంతాల్లో విస్తరించిన నైరుతి రుతుపవనాలు రానున్న నాలుగైదు రోజుల్లో తమిళనాడులోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. ఇందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. అరేబియా సముద్రం, బంగాళాఖాతం కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనాల కారణంగా రుతుపవనాలు వేగంగా ముందుకు కదులుతున్నాయని అధికారులు తెలిపారు. లక్షద్వీప్, కొమోరిన్ ప్రాంతం నుంచి ఈశాన్య బంగాళాఖాతం వరకు రుతుపవనాలు ఇప్పటికే విస్తరించాయి. రుతుపవనాల రాకతో రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాలులు క్రమంగా తగ్గుముఖం పడతాయని అధికారులు తెలిపారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా దేహగాన్ లో రికార్డు స్థాయిలో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ, రానున్న రోజుల్లో ఉపశమనం లభించనుంది. జూన్ 1 నుంచి హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రతలు 36-38 డిగ్రీలకు, ఇతర జిల్లాల్లో 40-42 డిగ్రీలకు తగ్గుతాయని అంచనా. జూన్ 5 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు 38-39 డిగ్రీల మధ్య స్థిరపడనున్నాయి. కాగా, ఆది, సోమవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

# నేడు కుమ్రం భీం -ఆసిఫాబాద్ జిల్లాకు సీఎం

మొదటి తరువాయి

ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.56.55 కోట్లు. రెబ్బెన మండలం నాంబాల్ గ్రామంలో రూ.6 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సౌర విద్యుత్ ప్లాంట్ పనులకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అదే విధంగా చింతలమానేపల్లి, గుడ్లబోరి, కాపువాడ, చింతకుంట, అంకుషాపూర్ ప్రాంతాల్లో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల పనులకు కూడా ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఉపకేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత బలోపేతం కావడంతో పాటు వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి రానుంది. జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో రూ.15 కోట్లతో చేపట్టనున్న తొమ్మిది అభివృద్ధి పనులు, కాగజ్ నగర్ మున్సిపాలిటీలో రూ.18.70 కోట్లతో చేపట్టనున్న ఎనిమిది అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా జిల్లాలో విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ, పునరుత్పాదక ఇంధన వినియోగ ప్రోత్సాహం, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి జూపల్లి తెలిపారు.

# రైతులను ఆదుకోవాలి

మొదటి తరువాయి

సుప్రీంకోర్టు వరకు వెళ్తామని స్పష్టం చేశారు. కేంద్రం తెచ్చిన కొత్త సోలార్ జీవో.. బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటన దారుణమన్నారు. సీఎం, ఖమ్మం జిల్లా మంత్రులు బాధ్యత వహించి ఆ చిన్నారి పేరిట రూ.25 లక్షలు ఫిక్స్డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. దసరా నాటికి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును ప్రతిపాదించకపోతే పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు.



# పనితీరు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరిక

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, మే 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రజాపాలన పనితీరు నచ్చి సర్పంచులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం హైద్రాబాద్ లోని ఆయన నివాసంలో కడ్తాల్ మండల అధ్యక్షుడు బిచ్యా నాయక్ అధ్వర్యంలో వాసుదేవపూర్ సర్పంచ్ కేతవత్ రమేష్ నాయక్, వార్డు సభ్యులు మరియు 50 మంది తండా నాయకులు ఎమ్మెల్యే నారాయణరెడ్డి, టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా సమక్షంలో హస్తం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో శిరీష రవి నాయక్, ఫూల్య నాయక్, తర్య నాయక్, నాన్య నాయక్, గొప్య నాయక్, వస్య నాయక్, బుజ్జా నాయక్, శంకర్, భీక్య, కిషన్, రాజు, శ్రీరామ్, బాల్య, రవీందర్, రాజు గోపాల్, కృష్ణా, కిషన్ మల్లేష్, శివ, మల్లేష్, రవి, హరి, సందీప్ మరియు కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్, సర్పంచ్ అమర్ సింగ్ నాయక్, మాజీ సర్పంచ్ నరేందర్ నాయక్, పర్వతలు, గణేష్ గౌడ్, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను కలిసిన గోలి శ్రీనివాస్ రెడ్డి



**ఆమనగల్లు, మే 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆదివారం ఎర్రవెల్లిలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులతో పాటు కల్వకుర్తి నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, ప్రజల అభిప్రాయాలు, స్థానిక నాయకత్వం పనితీరు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై కేసీఆర్ ఆరా తీశారు. గ్రామస్థాయి నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించినట్లు సమాచారం. పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమన్వయం పెంచుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రతి గ్రామంలో పార్టీ కార్యకలాపాలు చురుకుగా కొనసాగించాలని, రికార్డు స్థాయిలో సభ్యత నమోదు చేయాలని కేసీఆర్ సూచించినట్లు గోలీ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తిలో పార్టీకి ఉన్న ప్రజాభిమానాన్ని మరింత పెంచే దిశగా కార్యాచరణ రూపొందించాలని కేసీఆర్ పేర్కొన్నట్లు గోలి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదు

**-- సర్పంచ్ గోపు రజిత, లక్ష్మారెడ్డి**

**పెద్దపల్లి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని వ్యాఖ్య**



**ఎలిగేడు, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రెండున్నర ఏళ్లలో పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తూ రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని, విమర్శిస్తే సహించేది లేదని బుర్హాన్మియాపేట సర్పంచ్ గోపు రజిత, లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, "వరిధాన్యం కొనుగోలు పూర్తిగా పారదర్శకంగా జరుగుతోంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడా కొనుగోలు జరగలేదు. ఇది చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారు" అని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వడ్ల కటింగ్ పేరుతో రైతులను దోచుకున్నారని ఆరోపిస్తూ, "చెరువు మట్టిని అమ్ముకున్న చరిత్ర బీఆర్ఎస్ పాలనలోనే జరిగింది. విజయరమణారావు చేస్తున్న అభివృద్ధిని తట్టుకోలేక బీఆర్ఎస్ పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు నానా తంతాలు పడుతోంది" అని విమర్శించారు. వరిధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తయ్యాయని, ఎక్కడా రైతులు ఎక్కువ తూకం వేస్తున్నారని చెప్పలేదని, కావాలనే అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. "నియోజకవర్గ ప్రజల, రైతుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న విజయరమణారావును విమర్శిస్తే సహించేది లేదు" అని గోపు రజిత, లక్ష్మారెడ్డి హెచ్చరించారు.

# నేటి రాశి ఫలాలు





**మేషరాశి**

మీ మాటకు విలువ పెరుగుతుంది. దూరపు బంధువుల నుండి ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. చేపట్టిన పనులు అనుకున్న రీతిలో పూర్తి చేస్తారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు అనుకూలిస్తాయి. ఉద్యోగాలు ఉత్సాహంగా సాగుతాయి. గురు పారాయణ శుభకరం

**వృషభరాశి**

స్నేహితులతో అన్యోన్యంగా ఉండాలి . నూతన ఋణయత్నాలు చేస్తారు. ప్రయాణాలలో స్వల్ప మార్పులు ఉంటాయి. అనారోగ్య సమస్యలు మరింత బాధిస్తాయి. పనులలో శ్రమ తప్పదు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు కొంత నిరాశ కలిగిస్తాయి. దక్షిణామూర్తి శ్లోకం శు భకరం

**మిథునరాశి**

ప్రారంభించిన కొన్ని పనులు వాయిదా వేస్తారు. శారీరక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. నూతన ఉద్యోగయత్నాలు ముందుకు సాగవు. ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. ఉద్యోగమున అధికారులతో వ్యతిరేకత పెరుగుతుంది. దత్తాత్రేయ నామస్మరణ శుభకరం

**కర్కాటకరాశి**

దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. కుటుంబంలో ఒత్తిడులు తొలగుతాయి. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. వ్యాపారాలు విశేషంగా రాణిస్తాయి. ఉద్యోగాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. పితృదేవతల నామస్మరణ శుభకరం

**సింహరాశి**

ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. దూరపు బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు ఉత్సాహంగా సాగుతాయి. వ్యాపారాలు ఆశించిన మేరకు రాణిస్తాయి. ఉద్యోగాలు సాఫీగా సాగుతాయి. కులదేవత నామస్మరణ శుభకరం

**కన్యరాశి**

ఇంటా బయట బాధ్యతలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. దైవదర్శనాలు చేసుకుంటారు. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపార, ఉద్యోగాలు కొంత నిరుత్సాహపరుస్తాయి. ఇష్టదేవత దేవుళ్ళ నామస్మరణ శుభకరం.

**తులరాశి**

చిన్ననాటి మిత్రులతో అకారణంగా వివాదాలు కలుగుతాయి. వ్యాపారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ వ్యవహారాలలో ఆకస్మికంగా నిర్ణయాలలో మార్పులు చేస్తారు. విద్యార్థుల కష్టానికి తగిన ఫలితం అందదు. ఉద్యోగాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి. శ్రీ దుర్గా దేవి నామస్మరణ శుభకరం.

**వృశ్చికరాశి**

గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక లావాదేవీలలో చికాకులు తొలగుతాయి. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు గతం కంటే మెరుగ్గా ఉంటాయి. ఉద్యోగాలలో మరింత పురోగతి కలుగుతుంది. శివ పంచాక్షరి పటిస్తే శుభకరం

**ధనస్సురాశి**

ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుంది. చేపట్టిన పనుల్లో అవాంతరాలు తప్పవు. చిన్నపాటి అనారోగ్య సమస్యలు ఉంటాయి. సన్నిహితులతో విభేదాలు కలుగుతాయి. నూతన ఉద్యోగయత్నాలు ముందుకు సాగవు. వ్యాపారాలు నిదానిస్తాయి. ఉద్యోగాలలో సమస్యలు మరింత చికాకు పరుస్తాయి. శ్రీ విష్ణు నామ స్మరణ శుభకరం.

**మకరరాశి**

నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు పొందుతారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఆత్మీయులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. గురు నామస్మరణ శుభకరం.

**కుంభరాశి**

ఒక విషయంలో బంధువుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు ఉంటాయి. దైవచింతన పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. శని నామస్మరణ శుభకరం.

**మీనరాశి**

ఆత్మీయులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలు ఉన్నవి. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు అనుకూలిస్తాయి. వెంకటేశ్వర నామస్మరణ శుభకరం.

**(రాశి ఫలితాలు నిపుణులు సలహాలతో పరిగణించుకోవాలి)**



శ్రీ కాలభైరవ ఉపాసకులు
డక్క జంబులయ్య (స్వామి)
9491163914


# మమతా బెనర్జీకి షాక్..

**-పార్టీ సమావేశానికి 60 మంది ఎమ్మెల్యేల డుమ్మా**




**న్యూఢిల్లీ మే 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి సొంత పార్టీ నేతలే షాకిచ్చారు. ఆమె నివాసంలో పార్టీ ఎమ్మెల్యేలతో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఏకంగా 60 మంది ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. 20 మంది వరకు ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారు. దీంతో ఏకంగా ఈ సమావేశాన్ని రద్దు చేస్తూ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశం గురించి పార్టీ ఎమ్మెల్యేలకు ముందుగానే సమావేశం అందింది. టీఎంసీ లెజిస్లేటివ్ పార్టీ లీడర్ షోవన్‌దేవ్ ఛట్టోపాధ్యాయ్ అందరికీ సమావేశం గురించి చెప్పారు. కోల్‌కతాలోని, కాలిఘాట్‌లో ఉన్న పార్టీ అధినేత్రి మమత నివాసంలో, ఆమె ఆధ్వర్యంలోనే ఆదివారం సమావేశం ఉంటుందని ఆయన అందరికీ చెప్పారు. 80 మంది ఎమ్మెల్యేలకు సమాచారం అందిస్తే.. 20 మంది మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. ఈ రోజు హాజరైన వారితో మమత కొద్దిసేపు మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ పరిణామంపై టీఎంసీ స్పందించింది. అభిషేక్ బెనర్జీపై శనివారం, కల్యాణ్ బెనర్జీపై ఆదివారం దాడి జరిగిన నేపథ్యంలో, తమ నేతలపై వరుసగా జరుగుతున్న దాడులకు భయపడి ఎమ్మెల్యేలు ఈ సమావేశానికి రాలేదని పార్టీ అగ్రనాయకత్వం తెలిపింది. దీనంతటికీ కారణం బీజేపీనే అని విమర్శించింది. అయితే, నిజంగానే ఎమ్మెల్యేలు దాడులకు భయపడి రాలేదా.. లేదా పార్టీ అధినాయకత్వంపై ఆగ్రహంతో ఉన్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. టీఎంసీ నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. కొందరు తమ పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నారు. దీంతో టీఎంసీలో ఎంతమంది నేతలు కొనసాగుతారనేది అనుమానాస్పదమే. మరోవైపు బీజేపీ చేస్తున్న దాడులకు నిరసనగా జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా టీఎంసీ నేతలు ఆందోళన నిర్వహించనున్నారు. మమతా బెనర్జీ కూడా ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

# కేరళకు ఎల్లో అలర్ట్



**తిరువనంతపురం మే 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** రాబోయే ఐదు రోజుల పాటు కేరళ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. భారీ వర్షపాతం కురిసే అవకాశం ఉన్నందున, ఆదివారం నాడు ఆరు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. కొట్టాయం, ఎర్నాకులం, ఇడుక్కి, కోజికోడ్, వాయనాడ్ , కన్నూర్ ఉన్నాయి. ఈ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 24 గంటల వ్యవధిలో 64.5 మి.మీ నుండి 115.5 మి.మీ మధ్య వర్షపాతం నమోదైతే, దానిని ఐఎండీ "అక్కడక్కడ భారీ వర్షపాతం" (ఐఎస్‌ఓఎల్ హెచ్ )గా వర్గీకరిస్తుంది. ఈ వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు కూడా సంభవించవచ్చని భావిస్తున్నారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం, మట్టి చరియలు జారే అవకాశం ఉన్నది. అలాగే ఆకస్మిక వరదలు సంభవించే ప్రాంతాల్లో నివసించే ప్రజలు, అధికారిక ఆదేశాలకు అనుగుణంగా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు సూచించారు. నదీ తీరాల్లో , ఆనకట్టల దిగువ ప్రాంతాల్లో నివసించే వారు కూడా ముందు జాగ్రత్త చర్యగా అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సలహా ఇచ్చారు. రాబోయే మూడు గంటల వ్యవధిలో తిరువనంతపురం, కొల్లం, అలప్పుజ, కొట్టాయం, ఎర్నాకులం, త్రిశూర్, మలప్పురం, కోజికోడ్, కన్నూర్ , కాసరగోడ్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, వీటితో పాటు ఉరుములు, మెరుపులు , గంటకు 40 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. కేరళ , లక్షద్వీప్ తీరాల్లో సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, గంటకు 35 నుంచి 45 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, కొన్ని సమయాల్లో ఈ గాలుల వేగం గంటకు 55 కి.మీ వరకు కూడా చేరవచ్చని అంచనా వేస్తున్నారు.

## ఆకుల బాలయ్య కుటుంబాన్ని బహిష్కరించిన కుల పెద్దలు



**హుస్నాబాద్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నాగారం గ్రామంలో ఆకుల బాలయ్య కుటుంబాన్ని కుల పెద్దలు బహిష్కరించిన ఘటన కలకలం రేపుతోంది. చేపల చెరువు వివాదం కారణంగా ఏడు సంవత్సరాలుగా కొనసాగుతున్న గొడవల నేపథ్యంలో గ్రామ పెద్దలు ఈ కుటుంబాన్ని పెళ్లిళ్లు, చావులు వంటి సామాజిక కార్యక్రమాలకు రాకూడదని నిర్ణయించారు. దీంతో గ్రామంలో తిరగలేని పరిస్థితి ఏర్పడిందని బాధితులు విలేకరుల ముందు వాపోయారు. పోలీసులను ఆశ్రయించినా సరైన న్యాయం జరగలేదని, తమకు ప్రాణహాని ఉందని బాలయ్య కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. కుల బహిష్కరణ చేసిన పెద్దమనుషులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నేతలు ఇలాంటి కులపిచ్చి నిర్ణయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కుల బహిష్కరణ ఘటనపై గ్రామంలో తీవ్ర చర్చ జరుగుతోంది.

## గురుకులం విద్య మాత్రమే కాకుండా జీవన విలువలను నేర్పిన విద్యాలయం





**హుస్నాబాద్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

1994లో స్థాపించబడిన హుస్నాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నేడు వేలాది మంది ఉన్నతాధికారులు, వైద్యులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు, సైనికులు, ప్రజాప్రతినిధులను సమాజానికి అందించిన విద్యా కేంద్రంగా నిలిచింది. 1996లో తొలి ఎస్ఎస్సీ బ్యాచ్‌తో ప్రారంభమైన విజయగాథ నేటికీ కొనసాగుతోంది. ప్రతి సంవత్సరం వందశాతం ఫలితాలు సాధిస్తూ రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది. విద్యతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలను విద్యార్థుల్లో పెంపొందించింది. 1996--2016 మధ్యకాలంలో చదివిన పూర్వ విద్యార్థులు రీయూనియన్ నిర్వహించి గురువులకు ఘన సన్మానం చేశారు. శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించిన విద్యార్థులు తమ జీవితాలకు దిశానిర్దేశం చేసిన గురువుల పట్ల కృతజ్ఞతలు తెలిపారు. గురువులు మాట్లాడుతూ విద్యార్థుల విజయాలే మా నిజమైన సంపద అని భావోద్వేగంగా పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని, కెరీర్ గైడెన్స్, పోటీ పరీక్షలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని సంకల్పించారు. హుస్నాబాద్ గురుకులం విద్య మాత్రమే కాకుండా జీవన విలువలను నేర్పిన విద్యాలయంగా నిలిచింది.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



కరీంనగర్ రూరల్ పోలీసులు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. కిసాన్ నగర్‌కు చెందిన నీరుకుల్లా అనిల్ కుమార్ మానేరు వాగు నుండి ఇసుకను దొంగలించి మొగ్దుంపూర్ వద్ద పట్టుబడ్డాడు. సుల్తానాబాద్ మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన దాసరి వినయ్ బహదూర్ ఖాన్‌పేట్ వద్ద అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు ముమ్మర చర్యలు కొనసాగిస్తున్నారు.

## ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

**గన్నేరువరం, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



గన్నేరువరం మండలం మైలారం గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుల్లతో, బైండ్ల పూజలతో గ్రామమంతా పండగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇంటి నుండి బోనం తీసి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా వారాల మల్లేశం మాట్లాడుతూ, వర్షాలు సమృద్ధిగా కురవాలని, ప్రజలందరినీ చల్లగా చూడాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామమంతా భక్తి, ఉత్సాహ వాతావరణంలో పోచమ్మ బోనాలు జరిగాయి.

# జూన్ 2న ఉద్యమకారుల ర్యాలీనీ విజయవంతం చేయాలని జేఏసీ పిలుపు

**హుస్నాబాద్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉద్యమకారుల గుర్తింపు కమిటీపై హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. కమిటీలో ఉద్యమ సంస్థల ముఖ్యులు, మేధావులను చేర్చాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేసింది. జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, కో-కన్వీనర్ మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ, ఉద్యమకారులకు 250 గజాల స్థలాలు, 25 వేల పెన్షన్, ఉచిత విద్య, వైద్యం, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. ఈ డిమాండ్లతో జూన్ 2న ఉదయం 9 గంటలకు అంబేద్కర్ చౌరస్తా నుండి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో మేకల వీరన్న యాదవ్, మడుప ప్రభాకర్ రెడ్డి, కోయడ కొమురయ్య, బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఐలెని మల్లికార్జునరెడ్డి, ఉప్పల వెంకటరమణా రెడ్డి, ఎడబోయిన తిరుపతి రెడ్డి, అన్వర్, గడిపె మల్లేష్, లావుద్య కిషన్ నాయక్, ఇల్లందుల లక్ష్మణ్, భుక్య రమేశ్ నాయక్, పి. రాజ్ కుమార్, బండి పుష్ప, బత్తుల చంద్రమౌళి, మెతుకు కొమురయ్య, ఎం. ప్రభాకర్ రెడ్డి, ఎన్. అజయ్ కుమార్, చింతల రామచంద్రం, జె. యాదగిరి, వినీత్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యమకారుల హక్కుల సాధన కోసం జూన్ 2 ర్యాలీని విజయవంతం చేయాలని జేఏసీ పిలుపునిచ్చింది.

## ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు డిమాండ్



**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్‌కు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, యూనియన్ అధ్యక్షుడు పున్నం రవి డిమాండ్ చేశారు. కోతిరాంపూర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వాల్మార్ట్, డీమార్ట్, బ్యాంకులు, ఏటీఎంలు, షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్ వద్ద పనిచేస్తున్న గార్డ్స్‌ను రోజుకు 12--14 గంటలు పనిచేయించి కేవలం రూ.10,000--12,000 మాత్రమే ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఫంక్షన్ హాల్స్‌లో తాత్కాలికంగా పనిచేసే గార్డ్స్‌కు రోజుకు 8 గంటల పనికి రూ.800 చెల్లించాలని తీర్మానం చేశారు. లైసెన్సు లేకుండా ఏజెన్సీలు నడుపుతున్న వాటిపై లేబర్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, గార్డ్స్‌కు యూనిఫాం, టోపీ, టార్చ్‌లైట్ ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎరుమడ్ల పరుశురాం, సుంకరపల్లి ప్రవీణ్, కోదాటి కనకయ్య, గౌరు శంకర్, ఎలబోతారం చరణ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. సెక్యూరిటీ గార్డ్స్ శ్రమను దోపిడీ చేస్తున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని యూనియన్ డిమాండ్ చేసింది.

## టీబీ ముక్త్ భారత్ ఎక్స్‌రే శిబిరం

**తిమ్మాపూర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



రేణికుంట గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఉచిత ఛాతీ ఎక్స్‌రే స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎలుక ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 70 మంది గ్రామస్తులకు పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశారు. టీబీ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స చేయడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం పట్ల సర్పంచ్ ఆంజనేయులు సంతోషం వ్యక్తం చేస్తూ, ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, వైద్యురాలు డాక్టర్ జవేరియా ఇమ్రోజ్, ఏఎన్ఎం పద్మ, ఆశా కార్యకర్తలు ఎలుక విజయలక్ష్మి, శ్వేత, కర్ర అరుణ, టీబీ సూపర్వైజర్ సదయ్య, టీబీ ముక్త్ భారత్ బృందం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణకు శిబిరం ఉపయోగకరంగా నిలిచింది.

## ఘనంగా పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణా తరగతులు

**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్--2026 జిల్లాస్థాయి తరగతులు ఉత్సాహంగా జరిగాయి. ఈ శిక్షణా శిబిరంలో భాగంగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసారమయ్యే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి--డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, శ్రేణులు సమిష్టిగా వీక్షించారు. ఉద్యమ ఉత్సాహంతో సాగిన శిక్షణా తరగతులు, 'మన్ కీ బాత్' కార్యక్రమం వీక్షణతో ప్రత్యేకత సంతరించుకున్నాయి.

## విజయవంతంగా ముగిసిన స్పోకెన్ ఇంగ్లీష్ సమ్మర్ క్యాంప్



**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వినూత్న చొరవతో నిర్వహించిన 15 రోజుల స్పోకెన్ ఇంగ్లీష్ సమ్మర్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ ప్రత్యేక పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇంగ్లీష్ మాట్లాడే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారు. పారామిత హెరిటేజ్ స్కూల్ డైరెక్టర్ హనుమంతరావు ప్రతిరోజూ తరగతులు నిర్వహించి, సంభాషణా వ్యాయామాలు, వర్క్‌షీట్లు, సరదా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచారు. విద్యార్థులు మాట్లాడుతూ, ఇంగ్లీష్ మాట్లాడటంపై ఉన్న భయం తొలగిపోయిందని, ఇప్పుడు ధైర్యంగా మాట్లాడగలుగుతున్నామని తెలిపారు. క్యాంప్ ముగింపు సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ఇంగ్లీష్‌పై ఆత్మవిశ్వాసం నింపిన ఈ క్యాంప్ ఆదర్శంగా నిలిచింది.

## ఘనంగా అహల్యబాయి 301వ జయంతి ఉత్సవాలు



**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కురుమ సంఘం ఆధ్వర్యంలో మహారాణి అహల్యబాయి హోల్కర్ 301వ జయంతి ఉత్సవాలు ఆదివారం జిల్లా కురుమ సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కడారి అయిలన్న మాట్లాడుతూ, అహల్యబాయి సాధారణ గొర్రెల కాపరి కుటుంబంలో జన్మించి, 30 సంవత్సరాల పాటు ఇండోర్, మహేశ్వర్ రాజధానుల నుంచి పరిపాలన సాగించి ప్రజల సేవలో నిలిచారని తెలిపారు. ఆమె దేవాలయాల పునరుద్ధరణ, సత్రాల నిర్మాణం, నీటి వసతులు, రహదారుల అభివృద్ధి వంటి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని, ప్రజలు ఆమెను దేవతగా పూజించారని పేర్కొన్నారు. అహల్యబాయి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిగుర్ల శ్రీనివాస్, ఈరల్ల విజయ్ కుమార్, సంద స్వప్న, ఉడిగా రాజశేఖర్, మేకల పర్శరామ్, పెద్ది మానస తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు. మహారాణి అహల్యబాయి సేవా కార్యక్రమాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని సంఘం నేతలు పేర్కొన్నారు.

# జనసేనపై దుష్ప్రచారం చేస్తే తిప్పికొడతామని జనసేన నేతలు హెచ్చరిక

**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పై ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కరీంనగర్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి, ఇది ప్రణాళికాబద్ధమైన దుష్ప్రచారం అని అన్నారు.ఆదివారం తెలంగాణ చౌక్‌లో కళ్యాణ్ సేన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనసైనికులు నాగేశ్వర్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టి తగలబెట్టారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, లెఫ్ట్ భావజాలం గల వ్యక్తులు, అర్బన్ నక్సలైట్లు, ఉద్యమ ద్రోహులు పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని, వీటన్నింటిని తిప్పికొట్టేందుకు జనసేన సిద్ధంగా ఉందని హెచ్చరించారు.జనసేన పార్టీ తెలంగాణలో బలపడుతున్నందునే ఇలాంటి కుట్రలు జరుగుతున్నాయని, రాబోయే ఎన్నికల్లో పార్టీ పోటీ



చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కందుల రాజీ రెడ్డి, వొడ్నల రాజు, కాసా రాజు, పొన్నాల తిరుపతి, సామ చరణ్ రెడ్డి, గూడూరి రామ్, యశ్వంత్రావ్, నాయిని రవి వర్మ, రాకేష్, మల్లయ్య, శ్రీనివాస్ రావు, సాత్విక్, హర్ష, శివాజీ, సురేష్, ప్రవీణ్, శ్రీధర్, అభిషేక్, హరీష్, సృజన్ తదితరులు పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్‌పై దుష్ప్రచారం చేస్తే తిప్పికొడతామని జనసేన నేతలు హెచ్చరించారు.

# 40వ డివిజన్‌లో వీధి కుక్కల బెడద



**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 40వ డివిజన్ (హనుమాన్ నగర్, కోతిరాంపూర్, తిరుమల నగర్, బాలాజీ నగర్) ప్రజలు వీధి కుక్కల స్వైర విహారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా తిరుగుతూ పాదాచారులు, వాహనదారులపై దాడులకు తెగబడుతున్నాయని, ప్రజలు రోడ్లపైకి రావడానికే జంకుతున్నారని తెలిపారు. రాత్రివేళల్లో మొరుగుడు వల్ల స్థానికులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని మండిపడ్డారు. త్వరలో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో పిల్లల భద్రత దృష్ట్యా మున్సిపల్ అధికారులు ప్రత్యేక నిధులు కేటాయించి కుక్కలను వేరే ప్రాంతాలకు తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో నిర్లక్ష్యం వల్ల అనేక మంది కుక్కల దాడిలో గాయపడ్డారని గుర్తుచేశారు. తక్షణమే చర్యలు చేపట్టకపోతే ప్రజలను సమీకరించి మున్సిపల్ ఆఫీస్ ముందు ఆందోళన చేస్తామని పైడిపల్లి రాజు హెచ్చరించారు.ప్రజల భద్రత కోసం మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించాలని సిపిఐ నేత డిమాండ్ చేశారు.

# పేకాట స్థావరం దాడి

## - ఎనిమిది మంది అరెస్ట్



**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ రూరల్ పోలీసులు తీగలగుట్టపల్లి సరస్వతి నగర్ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి ఎనిమిది మంది జూదరులను అరెస్ట్ చేశారు.ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో నిందితుల వద్ద నుండి రూ.53 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారు ప్రకాశం జిల్లా నుండి వచ్చి ఇక్కడ కాంట్రాక్టు పనులు చేస్తూ నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు.నిందితులు తన్నీరు శ్రీను, ఓర్సు సందీప్, తన్నీరు శేషయ్య, పొట్లపాటి అబ్రహం, వల్లెపు రవి, కుంచాల నాగేంద్రబాబు, వల్లెపు పుల్లరాజు, పుల్లపు వెంకటరావు అని గుర్తించారు. వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు.ఈ దాడిలో ఎస్ఐ లక్ష్మారెడ్డి, రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.అక్రమ పేకాట స్థావరాలపై పోలీసులు చర్యలు కొనసాగిస్తున్నారు.

# ఉపాధ్యాయుడి కుటుంబానికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం

**పెద్దపల్లి, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



పెద్దపల్లి మండలం రంగాపూర్ పాఠశాల ప్రభుత్వ ఉపాధ్యాయుడు, పిఆర్టీయుటిఎస్ సంఘ క్రియాశీలక సభ్యుడు కల్వల శ్రీనివాస్ ఇటీవల అకాల మరణం చెందగా, ఆయన కుటుంబానికి సంఘం చేయూతనందించింది.సంఘం రాష్ట్ర సంక్షేమ నిధి నుండి రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని చెక్ రూపంలో మృతుని సతీమణి ధనలక్ష్మికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కల్వల శ్రీనివాస్ సంఘానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గండు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కానిగంటి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మెతుకు తిరుపతి, ప్రధాన కార్యదర్శి లక్కర్స్ రాములు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు చిలువేరు సదాశివ, నీలం నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓల్లే శ్రీనివాస్, జిల్లా నాయకులు కాసార్ల శ్రీనివాస్, కజ్జం రాజు, దొమ్మటి రాజేందర్, కర్నె రాజు, తాళ్ల నరేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.మరణించిన ఉపాధ్యాయుడి కుటుంబానికి సంఘం చేయూతనందించడం హృదయపూర్వకంగా అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

# బిఆర్ఆర్ ఫౌండేషన్ సమక్షంలో బ్యాగుల పంపిణీ



**మంచాల, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆరుట్ల గ్రామంలో బి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగుల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి మాట్లాడుతూ, యువకులు మద్యపానం, డ్రగ్స్‌కు దూరంగా ఉండి మంచి చదువులు చదివి గ్రామానికి మంచి పేరు తేవాలని పిలుపునిచ్చారు. ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటికే వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశామని, త్వరలో నాలుగు బోర్లు వేయిస్తామని తెలిపారు. మహిళా సంఘాల కార్యాలయాల వద్ద మరుగుదొడ్లు నిర్మాణం కూడా చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాలిపాటి శోభా కుమార్, ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్, వార్డు సభ్యురాలు మొగ్రి పద్మ, పున్నం రాము, మహమ్మద్ సద్దాం, అశ్వల బాలరాజు, కొత్తపల్లి సాయిగౌడ్, సుంకరి బాను గౌడ్, డ్వాక్రా సంఘాల వి.ఓలు రుద్ర, అనిత, స్రవంతి, ప్రమీల, జ్యోతి, సంతోష, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.ప్రజాసేవలో ముందుండే బి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డిని గ్రామస్థులు అభినందించారు.

# ఎస్ఐఆర్--2026పై కూటమి కుట్ర

**నందికొట్కూరు, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**




కూటమి ప్రభుత్వం కుట్రతో ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్--2026పై వైఎస్సార్సీపీ బూత్ లెవల్ ఏజెంట్లకు అవగాహన కల్పించాలని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర వైసీపీ యువ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆదేశాల మేరకు నందికొట్కూరు వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో సమావేశం జరిగింది.ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ దారా సుధీర్, అబ్జర్వర్ బుడ్డ శే సి రెడ్డి ఏజెంట్లకు కీలక సూచనలు చేశారు. వారు మాట్లాడుతూ, "టిడిపి--బిజెపి--జనసేన కూటమి ఓటర్లను గల్లంతు చేసేందుకే ఎస్ఐఆర్--2026ను ప్రవేశపెట్టింది. ఓటరు జాబితా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, ఇంటింటి పరిశీలన, వివరాల ధృవీకరణలో అప్రమత్తంగా ఉండాలి" అని అన్నారు.ప్రతి బూత్‌లో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ఏజెంట్లు ప్రజలతో సమన్వయం పెంచి ఓటర్ల హక్కులను కాపాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ లెవల్ ఇన్చార్జీలు, కార్యకర్తలు, వైఎస్సార్సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# జూన్ 1 నుండి 15 వరకు ఘనంగా జరగనున్న సుడా ప్రగతి పక్షోత్సవాలు



**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) రెండేళ్లలో మునుపెన్నడూ లేనంత అభివృద్ధి సాధించిందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు.ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇప్పటికే 183 పనులు పూర్తి చేశామని, రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు, హైమాస్ లైట్లు, కూడళ్ల సుందరీకరణ వంటి పనులు జరిగాయని చెప్పారు. 800 గజాలలో రూ.5 కోట్లతో కమర్షియల్ బిల్డింగ్ నిర్మాణం, 20 ఏళ్లుగా వదిలేసిన ఐడిఎస్ఎంటి అభివృద్ధి, పార్కింగ్ సౌకర్యాలు, 40 షెట్టర్ల ఆధునీకరణ, ఫుడ్ కోర్ట్ ఏర్పాటుకు టెండర్లు పిలిచామని వివరించారు. రాజీవ్ చౌక్‌లో 9 అడుగుల రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేశామని, జూన్ 1 నుండి 15 వరకు సుడా ప్రగతి పక్షోత్సవాలు నిర్వహించి ప్రతిరోజూ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉంటాయని తెలిపారు. ఏడున్నర కోట్ల విలువైన కొత్త పనులకు టెండర్లు పిలిచామని, త్వరలో శంకుస్థాపనలు జరగనున్నాయని చెప్పారు.ఈ సమావేశంలో ఎండి తాజ్, చాడగొండ బుచ్చిరెడ్డి, టేల భూమయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, గుడిపాటి రమణారెడ్డి, మిర్యాల శ్రీధర్ రెడ్డి, జువ్వాడి అమరేందర్ రావు, కుర్ర పోచయ్య, దండి రవీందర్, జీడి రమేష్, మాసుంఖాన్ బషీర్, ఖలీల్, హనీఫ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.జూన్ 1 నుండి 15 వరకు సుడా ప్రగతి పక్షోత్సవాలు ఘనంగా జరగనున్నాయి.

# ఘనంగా జ్యేష్ఠ పౌర్ణమి యజ్ఞం



**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్థానిక సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా యజ్ఞం ఘనంగా నిర్వహించారు.వేదమంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ యజ్ఞంలో సింగం విజయ--గణేష్, మోర శ్వేత--రణధీర్, కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పుల్లల శ్యామ్ పాల్గొన్నారు. నందగిరి రామకృష్ణ శాస్త్రోక్తంగా యజ్ఞాన్ని నిర్వహించారు. ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ, జ్యేష్ఠ పౌర్ణమి రోజున యజ్ఞాలు, దానధర్మాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సు కలిగిస్తాయని, వాతావరణ శుద్ధి, సమాజ శ్రేయస్సుకు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బల్మూరి కరుణాకర్ రావు, గట్టు శ్రీనివాస్, కొత్తూరి ముకుందం, గట్టు రాంప్రసాద్, నడిపెల్లి దీనదయాళ్ రావు, అప్పిడి వకుళదేవి, ఎలగందుల సత్యనారాయణ, మేచినేని దేవేందర్ రావు, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు, తణుకు మహేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.జ్యేష్ఠ పౌర్ణమి యజ్ఞం భక్తి వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# వైభవంగా విష్ణు--లలితా సహస్రనామ పారాయణం

**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: అధికమాసం పురుషోత్తమమాసం పురస్కరించుకొని స్థానిక వైశ్య భవనంలో శ్రీ విష్ణు సహస్రనామం, శ్రీ లలితా సహస్రనామ పారాయణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.సుమారు 1300 మంది భక్తులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మయూరగిరి పీఠాధిపతి, జ్యోతిష్య--వాస్తు పండితులు నమిలకొండ రమణాచార్యుల ఆధ్వర్యంలో అభిషేకాలు, అష్టోత్తర ఆరాధనలు నిర్వహించారు. అనంతరం సామూహిక పారాయణాలు, భజనలు జరిగాయి. అధికమాసం పౌర్ణమి శుభదినం కావడంతో పలు ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పాల్గొన్న వారికి పుస్తకాలు



బహుమతిగా అందజేసి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గుండా రాధాకృష్ణ, వినయ్ స్వామి, రామకృష్ణమాచార్యులు, డాక్టర్ మనోజ్ కుమార్, తిరునగరి లక్ష్మణ్ స్వామి, పట్టణ పెద్దలు, మహిళా సంఘాలు, భజన బృందాలు పాల్గొన్నారు.భగవంతుని నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.

# కమలం పార్టీలో చేరికల జోష్



**బాలాపూర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో కమలం పార్టీలో చేరికల జోష్ కొనసాగుతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్‌లో మీర్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకుడు మేకల కృష్ణతో పాటు వివిధ కాలనీవాసులు నాదర్గుల్‌లోని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జి అందెల శ్రీరాములు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీరాములు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, "కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై విశ్వాసంతో ప్రజలు పెద్ద ఎత్తున బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుంది" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శులు నీలా రవి నాయక్, విజయలక్ష్మీ రాజు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సిద్దాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు సుల ప్రభాకర్, తులసి వెంకటేశ్వర్లు, కిషోర్, తుమ్మల రమేష్, జగన్ ముదిరాజ్, భాస్కర్, శ్రీను, శశి, లక్ష్మణ్, లింగస్వామి, సత్యనారాయణ, వెంకట్, మెరుగు శంకర్, రవికుమార్, శ్రీనివాస్, జి. శ్రీనివాస్, రమేష్, బండి వెంకటేష్, మల్లయ్య, మహేష్, వెంకటేష్, సైదులు, సిద్ధార్థ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని తోపుడు బండ్ల నిరసన

**బహుజన్ ముక్తి పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన**



**తాడూర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తాడూరు మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో బహుజన్ ముక్తి పార్టీ ఆధ్వర్యంలో తోపుడు బండ్ల ప్రదర్శన నిర్వహించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పార్టీ పార్లమెంట్ ఇన్చార్జి గడ్డం విజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 31 రాష్ట్రాల్లోని 625 జిల్లాల్లో ఈ నిరసన కార్యక్రమం జరుగుతోందని ఆయన తెలిపారు. "ప్రజలు పెట్రోల్, డీజిల్ కొనలేక వాహనాలను తోసుకుంటూ వెళ్ళాల్సిన పరిస్థితి బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. వెంటనే పెరిగిన ధరలను తగ్గించాలి" అని డిమాండ్ చేశారు. అదేవిధంగా గృహ వినియోగానికి సరిపడా వంట గ్యాస్ అందక ప్రజలు కట్టెల పొయ్యితో వంట చేసుకుంటూ కాలం వెళ్ళదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గృహ వినియోగానికి సిలిండర్ ధరను రూ.400కు, కమర్షియల్ వినియోగానికి రూ.700కు తగ్గించాలని ఆయన కోరారు. కరెంట్ వినియోగదారులకు అమర్చిన స్మార్ట్ మీటర్లు అధిక యూనిట్లను చూపిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. వెంటనే స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన్ ముక్తి పార్టీ నాయకులు గడ్డం అంజి, మద్దిలేటి, బీసీ సంఘం నాయకులు గొర్ల సుల్తాన్, చింతకాయల నారాయణ, అంబేద్కర్ సంఘం నాయకులు జెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ డీఈఓగా సుశిందర్ రావు నియామకం

**-భిక్షపతి యాదాద్రికి బదిలీ**



**నల్గొండ, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర విద్యాశాఖలో జరిగిన తాజా బదిలీల్లో భాగంగా నల్గొండ జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతిను యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు నల్గొండ జిల్లా నూతన విద్యాశాఖాధికారిగా ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా డీఈఓగా విధులు నిర్వహిస్తున్న సి. సుశిందర్ రావును నియమించారు.

# విజయవంతంగా ముగిసిన బీజేపీ శిక్షణా తరగతులు



**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్--2026 తరగతులు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. 12 సెషన్లలో సాగిన ఈ శిక్షణా శిబిరంలో 346 మంది పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తరగతులను ప్రారంభించి పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. రెండు రోజుల పాటు బీజేపీ నేతలు అయ్యంగారీ ప్రభాకర్ రెడ్డి, దేవకి వాసుదేవరావు, అల్లాపూర్ శ్రీనివాస్, బండారి శాంతి కుమార్, రాణి రుద్రమ, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, పోరెడ్డి కిషోర్, రంజిత్ మోహన్, మురళీధర్ రావు, కడగంచి రమేష్, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ భాను జీ తదితరులు పార్టీ బలోపేతం, ప్రజాక్షేత్రంలోకి వెళ్లడం, ప్రభుత్వ విధానాలపై అవగాహన వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ గవర్నర్ సి.హెచ్. విద్యాసాగర్ రావు మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరిస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ రావు, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రెండు రోజుల శిక్షణా తరగతులు బీజేపీ శ్రేణులకు మార్గదర్శకంగా నిలిచాయి.

# ఉద్యోగుల మే నెల వేతనంలో బలవంతపు కోతపై టీపీటీఎఫ్ ఖండన

**-విధివిధానాలు లేకుండానే మినహాయింపు సరికాదని ఆగ్రహం**

**హైదరాబాద్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉద్యోగుల మే నెల వేతనం నుండి ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కోసం 1.5 శాతం వేతనాన్ని బలవంతంగా మినహాయించడం పట్ల తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) తీవ్రంగా ఖండించింది. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ మాట్లాడుతూ, "ఉపాధ్యాయ ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి విధివిధానాలు విడుదల చేయలేదు. ఫైనాన్స్ శాఖలో ఇంకా పెండింగ్‌లో ఉన్న పథకానికి సంబంధించిన వివరాలు వెల్లడించకుండానే ఐఎఫ్ఎంఐఎస్ వెబ్‌సైట్‌లో పే స్లిప్పులు జెనరేట్ చేసి కోత విధించడం సరికాదు. కనీసం డ్రాయింగ్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా ఇలా వసూలు చేయడం అన్యాయం" అని అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ముందుగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆరోగ్య పథకం అమలయ్యే హాస్పిటల్స్ జాబితా, చికిత్సకు నోచుకునే జబ్బుల వివరాలు, ప్రైవేట్ ఇన్సూరెన్స్ ఉన్న ఉద్యోగుల విషయంలో స్పష్టత, భార్యాభర్తలు, తల్లిదండ్రులు ఉద్యోగులైన సందర్భాల్లో డిపెండెన్సీ నియమాలు, ప్యాకేజీల వివరాలు, మినహాయించిన సొమ్ము ఏ ఖాతాకు వెళుతుందో వంటి అంశాలపై స్పష్టమైన విధివిధానాలు ప్రకటించాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తుచేశారు. "విధివిధానాలు రూపొందించకుండానే వేతనంలో కోత విధించడం సరికాదు. వెంటనే విధివిధానాలను రూపొందించి, ఇప్పటికే మినహాయించిన సొమ్మును ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలి. లేనిపక్షంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తాం" అని ముత్యాల రవీందర్ హెచ్చరించారు.

# విద్యార్థులు ఆత్మరక్షణ విద్యల్లో రాణించాలి

**-ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**-మిర్యాలగూడలో ఉచిత కరాటే శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు**



**మిర్యాలగూడ, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా ఆడపిల్లలు ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మిర్యాలగూడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద కరాటే మాస్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ఉచిత కరాటే శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విచ్చేశారు. కరాటేలో వివిధ స్థాయిలు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బెల్టులు, అధికారిక సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వేసవి సెలవులను వృథా చేయకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు మాస్టర్ రామకృష్ణ ఉచితంగా శిక్షణ ఇవ్వడం అభినందనీయం. కరాటే కేవలం యుద్ధకళ మాత్రమే కాదు, అది విద్యార్థులలో మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తుంది" అని అన్నారు. నేటి తరం పిల్లలు మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా ఇలాంటి క్రీడల్లో రాణించాలని, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సమాజ సేవ దృక్పథంతో ఉచితంగా శిక్షణ ఇస్తున్న రామకృష్ణ మరియు వారి బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కరాటే అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# హెల్త్ కార్డులు ఇవ్వకుండానే ఉద్యోగుల ఖాతాలో డబ్బులు మాయం

**రాష్ట్ర పిఆర్టియు అసోసియేట్ ప్రెసిడెంట్ జడల సత్యనారాయణ ఆవేదన**



**ఎలిగేడు, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వడానికి సిద్ధమైన తరుణంలో, కార్డులు ఇవ్వకుండానే మే నెల జీతాల నుండి కోత విధించడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర పిఆర్టియు అసోసియేట్ ప్రెసిడెంట్ జడల సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, "హెల్త్ కార్డుల కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ కుటుంబ సభ్యుల పేర్లు, పిల్లల వివరాలు నమోదు చేసుకోవడానికి ఈ నెల 31 వరకు గడువు ఉన్నా, అదే రోజునే శాలరీ బిల్లుల నుండి డీడీలకు తెలియకుండానే నేరుగా ఆర్థిక శాఖ కోత విధించడం అర్థరహితంగా ఉంది. ఉద్యోగులు ఎరుగని రీతిలో డబ్బులు మాయం కావడం ఆందోళన కలిగిస్తోంది" అని అన్నారు. హెల్త్ కార్డులకు సంబంధించి ఇప్పటివరకు ఎటువంటి విధివిధానాలు విడుదల చేయకుండానే వేతనాల్లో కోత విధించడం సరికాదని ఆయన విమర్శించారు. "ఉద్యోగుల ఖాతాలో మినహాయించిన డబ్బులను వెంటనే జమ చేయాలి. లేనిపక్షంలో రాష్ట్రస్థాయిలో ఉద్యమం తప్పదు. అందరూ అసంతృప్తిగా ఉన్నారు. ముఖ్యమంత్రి వెంటనే చొరవ తీసుకొని ఆర్థిక శాఖతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలి" అని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల శాఖ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి యుగంధర్, సముద్రాల చంద్రమౌళి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు రవీందర్ రావు, ప్రసాద్, దేవేందర్, భాస్కర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దాం

**- అధ్యక్షుడు లండం చిన్న జంగయ్య**





**ఆమనగల్లు, మే 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ అడుగుజాడల్లో నడుద్దామని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లండం చిన్న జంగయ్య కోరారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ యువజన చైతన్య సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము, 12వ వార్డు నాగిళ్ళ జగన్ హాజరయ్యారు. ఈసందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వంకేశ్వరం భీమయ్య, మాజీ అధ్యక్షుడు అధ్యక్షుడు కామల్లా అంజయ్య లను పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సమ సమాజ నిర్మాణం కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జంతుక సైదులు, ఉపాధ్యక్షులు వస్పుల సురేష్, వస్పుల రంజిత్, గుమ్మకుండ రాజు, చాంద్ పాషా, లండం యాదయ్య, వస్పుల శేఖర్, మీసాల రమేష్, ఎండి అఫ్సర్, మద్దెల మల్లేష్, జంతుక అనిల్, యడవల్లి రమేష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీశైలం, విటాయిపల్లి రమేష్, రేవల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

# 11 ఏళ్ల కలయిక ...
# అవదుల్లేని ఆనందం

-గతాన్ని నెమరేసుకొని... ఆనందాన్ని పంచుకొని

-ఆప్యాయ పలకరింపులు.. ఆత్మీయ కరచాలనాలు

-చదువులమ్మ బడి - అమ్మ ఒడి

-ఘనంగా 2014 -15 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ఇబ్రహీంపట్నం, మే 31 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ఆనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులే. ఆప్యాయ పలకరింపులు.. ఆత్మీయ కరచాలనాలు.. భావోద్వేగ సన్నివేశాలు వెరసి పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వేదికయ్యింది. యాచారం మండలం కురిమిద్ద ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి 2014 – 15వ సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు కురిమిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థులు 11 సంవత్సరాల తర్వాత కలుసుకొని చాలా ఉత్సాహంగా గడిపారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని చేపట్టారు. గతాన్ని నెమరేసుకొనీ.. ఆనందంగా గడిపారు. ఒకరితో ఒకరు గతాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వారంతా తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దేశ, విదేశాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో స్థిరపడినవారు ఒక చోట కలుసుకుని పాత జ్ఞాపకాలను తలచుకున్నారు. 11 సంవత్సరాల తర్వాత స్నేహితులంతా ఒకేచోట చేరడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. మానవ జీవితంలో కులమతాలకు అతీతంగా ఉన్నది కేవలం ఒక స్నేహం మాత్రమేనని అన్నారు. జీవితంలో ఎంత ఉన్నత స్థాయిని ఎదిగిన స్నేహాన్ని మాత్రం మరువలేమన్నారు. భవిష్యత్తులో ఎవరి ఏ కష్టం వచ్చిన తోటి విద్యార్థులకు అండగా నిలబడాలని నిర్ణయం తీసుకున్నారు. తాము కలిసి చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఆనాటి తీపీ గుర్తులను నెమరువేసుకున్నారు. 11 సంవత్సరాల తర్వాత ఇలాంటి వేడుక చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఒక్కొక్కరూ ఒక్కొక్క రంగంలో సెటిల్ అవ్వడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు తమ జ్ఞాపకాలను తలుచుకుంటూ, స్వీయ చిత్రాలు తీసుకొని సందడిగా, సంతోషంగా ఆడి పాడారు. ఆనాడు గురువులు తమకు బోధించిన బోధనలు సూచించిన మార్గాలు నేర్పిన క్రమశిక్షణనే తమను ప్రస్తుతం సమాజంలో ఇంతటి ఉన్నత స్థానంలో నిలబడగలిగేలా ప్రేరేపించాయనీ ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. 11 సంవత్సరాల తర్వాత స్నేహితులంతా ఒకేచోట చేరడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. 11 సంవత్సరాల తర్వాత అందరం కలుసుకొని ఇలాంటి వేడుక నిర్వహించడం, విధ్యార్థులు వివిధ రంగాలలో రాణించడం ఎంతో గర్వంగా ఉందని నాటి ఉపాధ్యాయులు పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. అనంతరం బైకనీ శ్రీశైలం యొక్క చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అలనాటి గురువులకు జ్ఞాపికలను అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. సమ్మేళనంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తు పాండురంగారెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్యుత్ రెడ్డి, నాటి ఉపాధ్యాయులు అంజయ్య, వెంకటేశ్వర్ రావు, జగన్ మోహన్, రాజేష్, అన్నపూర్ణ, వెంకటచారీ, శ్రీనివాస్, మహేష్, సురేష్, పూర్వ విద్యార్థులు పంది శ్రీనివాస్, నీలం మధు, ఎస్.జగదీష్, నవీన్, ప్రవీణ్, ఎస్.శ్రీను, గోపాల్, వినోద్, శ్రీధర్, రాజు, మణికంఠ, కిరణ్, స్వామి, ఉమ, జ్యోతి, అఖిల, స్పందన, ప్రియాంక, లావణ్య, మౌనిక, శోభ, రోజా, పూజిత, మానస, పద్మ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమానికి కేంద్రం
# సమగ్ర శాసన చట్టం చేయాలి

-తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య డిమాండ్



**తిప్పర్తి, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేశానికి అన్నం పెడుతూ సంపదను సృష్టిస్తున్న వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సమగ్ర శాసన చట్టం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య డిమాండ్ చేశారు. తిప్పర్తి మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సంఘం ఎనిమిదవ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, "స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా వ్యవసాయ కార్మికులకు తినటానికి తిండి, ఉండటానికి ఇల్లు, కట్టుకోవటానికి బట్ట కరువైందే. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి గెలిచిన ప్రభుత్వాలు అనంతరం కార్మికులను విస్మరిస్తున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కార్మికులకు వేతనాలు సక్రమంగా ఇవ్వకుండా, రెండు పూటలా ఫోటోలు తీసే విధానం తీసుకురావడం అన్యాయమని విమర్శించారు. కొత్తగా ప్రవేశపెట్టిన విభజీ రాంజీ బిల్లును వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల కార్మికులు అప్పులు చేసి ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. "50 సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.5000 పింఛన్ మంజూరు చేయాలి. యాంత్రికరణ పెరిగిన తరువాత వ్యవసాయతర కార్మికులకు ఉపాధి కల్పించాలి" అని ఆయన కోరారు. ఇటీవల ఐదు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరగడం వల్ల నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని, వాటిని నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అసైన్మెంట్ భూములను సాగు చేసుకుంటున్న పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, పేదల ఆధీనంలో ఉన్న ఇండ్ల స్థలాలకు హక్కులు కల్పించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆయన కోరారు. గోదాముల్లో నిల్వలుగా ఉన్న ధాన్యాన్ని పేదలకు అందించి, ప్రస్తుతం ఇస్తున్న ఆరు కిలోల బియ్యాన్ని పది కిలోలకు పెంచాలని సూచించారు. ఈ మహాసభలో మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ, మండల కార్యదర్శి గండమల్ల రాములు, నాయకులు ఆకిటి లింగయ్య రెడ్డి, ఇందిరమ్మ, పల్లె సైదమ్మ, మర్రి రేణుక, సంకోజు శరత్, కన్నె బోయిన సైదులు, గంటకంపు చంద్రకళ, సంజీవరెడ్డి, బుల్లెద్దు నాగయ్య, పేరం లింగయ్య, తాటి సరిత, ఈర్ల వెంకన్న, ఎండి కరీం తదితరులు పాల్గొన్నారు.

# ఇటీవల మరణించిన నల్లోల రామచంద్రయ్య
# కుటుంబానికి అండగా నిలిచిన యువత



**యాచారం, మే 31( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించిన యాచారం మండలం నక్కర్త – మేడిపల్లి గ్రామానికి చెందిన నల్లోల రామచంద్రయ్య మరియు నల్లోల జగన్ కుటుంబాన్ని పరామర్శించిన స్థానిక యువకులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి తమ వంతు సహాయాన్ని అందించారు. కుటుంబం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని యువత క్వింటాల్ బియ్యాన్ని పంపిణీ చేసి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా యువకులు రామచంద్రయ్య నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామచంద్రయ్య మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఇలాంటి క్లిష్ట సమయంలో ఒంటరిగా భావించవద్దని, గ్రామ ప్రజలు మరియు యువత ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటారని భరోసా కల్పించారు.. అలాగే భవిష్యత్తులో కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు తోడ్పాటు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అవసర సమయంలో పరస్పరం సహకరించుకోవడం ద్వారా సామాజిక బంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు. ఇలాంటి సమయంలో తమకు ధైర్యం చెప్పి సహాయం అందించడం ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. గ్రామంలోని పలువురు పెద్దలు కూడా యువత చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ, యువతలో పెరుగుతున్న సేవాభావం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నక్కర్త – మేడిపల్లి గ్రామానికి చెందిన బుస్సు జంగారెడ్డి, కొంగల్లా చెన్నయ్య, జాలా ఐలేష్, తాంద్ర మహేష్, చేగురి శంకర్, సిద్ధగోని లింగం, వన్నాడపు శ్రీకాంత్ కందుకూరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

-విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం



**కనగల్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కనగల్ మండల కేంద్రంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన పనులను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం సందర్శించి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి, పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భనలో కనగల్ మాజీ జడ్పీటీసీలు నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, చిట్ల వెంకటేశం, ఆర్టీఏ డైరెక్టర్ కూసుకుంట్ల రాజిరెడ్డి, స్థానిక సర్పంచ్ నర్సింగ్ మురళీధర్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

# సత్య సాయి సేవ సమితి సేవలు ప్రశంసనీయం




**నల్లగొండ ,మే 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు సేవ చేసే భాగ్యం దొరకడం అదృష్టమని శ్రీ సత్య సాయి సేవ సమితి నల్గొండ కన్వీనర్ పున్న విశ్వేశ్వర్ అన్నారు. గత 28 సంవత్సరాలుగా హైదరాబాదు రోడ్ లోని తిరుమల థియేటర్ ఎదురుగా సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో బాటసారుల, కార్మికుల ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం నిర్వహిస్తున్నామని, చలివేంద్రంలో మంచినీరే కాక మజ్జిగ నిమ్మరసం పంపిణీ చేశామని అన్నారు. ఈ సంవత్సరం 53 రోజులుగా నిరాటంకంగా సత్య సాయి సేవ సమితి స్త్రీ పురుష సేవాదళ్ సభ్యులు సేవలు అందించడం జరిగిందని, తమ సంస్థకు ప్రతి సంవత్సరం సహకరిస్తున్న పల్లెర్ల యాదగిరి కుటుంబ సభ్యులను సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానించారు.

# హైదరాబాద్ నగరానికి తలమానికం

-- కోహెడ పండ్ల మార్కెట్

-జూన్ 3న ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన




**రంగారెడ్డి జిల్లా, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కోహెడలో నిర్మించనున్న పండ్ల మార్కెట్ హైదరాబాద్ నగరానికి తలమానికంగా నిలిచి, దేశ మార్కెటింగ్ చరిత్రలో నూతన అధ్యాయాన్ని లిఖించనుందని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఈ మార్కెట్‌కు జూన్ 3న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సురేంద్ర మోహన్, డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ లక్ష్మీబాయి, అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణుడు, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్, రెవెన్యూ, మార్కెటింగ్, పంచాయతీ రాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సభా ప్రాంగణంలో సౌకర్యాల కల్పన, ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని సురేంద్ర మోహన్ దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, "ఈ మార్కెట్ తెలంగాణ రైతులకు మాత్రమే కాకుండా పక్క రాష్ట్రాల రైతులకు కూడా ప్రధాన కేంద్రంగా మారుతుంది. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణను పండ్ల ఎగుమతుల హబ్‌గా మార్చేందుకు ఇది పునాదిగా నిలుస్తుంది. ప్రతి రైతుకు తన కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా ఈ మార్కెట్ తోడ్పడుతుంది" అని అన్నారు. రేవంత్ ప్రభుత్వం నిర్మిస్తున్న ఈ వ్యవస్థ తెలంగాణ రైతన్న ఆత్మగౌరవాన్ని పెంచుతుందని, ఇబ్రహీంపట్నం ప్రజలకు ఇది గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూధన్ రెడ్డి, వైస్ ఛైర్మన్ భాస్కరాచారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మార్కెటింగ్ శాఖ అధికారులు, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బస్ డిపో పనులు వేగవంతం చెయ్యాలి

-మంత్రి పొన్నం ప్రభాకర్



**పెద్దపల్లి, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రతిపాదిత బస్ డిపో స్థలాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పెద్దపల్లిలో బస్ డిపో మంజూరైనట్లు తెలిపారు. పనులు ఆలస్యమైనప్పటికీ వాటిని వేగవంతం చేసి త్వరలో ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల డిమాండ్ పెరిగిందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలు జరుగుతోందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇటీవల 11 శాతం పీఆర్సీ మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు త్వరలో నిర్వహించి, ఎన్నికైన ప్రతినిధులతో చర్చించి భవిష్యత్తులో విలీన ప్రక్రియ చేపడతామని తెలిపారు. కార్మికులు అనవసర ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## శాతవాహన విశ్వవిద్యాలయంలో వ్యాయామ విద్య ప్రవేశ పరీక్షలు ప్రారంభం



**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శాతవాహన విశ్వవిద్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వ్యాయామ విద్య ప్రవేశ పరీక్షలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉపకులపతి ఉమేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి, పాలమూరు విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి లక్ష్మీకాంత రాథోడ్, ఉన్నత విద్యా మండలి సెక్రటరీ శ్రీరామ్ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వ్యాయామ విద్యకు ప్రస్తుత కాలంలో అధిక ప్రాధాన్యత ఉందని, క్రీడలతో పాటు ఫిట్నెస్ రంగంలో కూడా అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నందున శాతవాహనలో సింథటిక్ ట్రాక్, స్పోర్ట్స్ గ్యాలరీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షల్లో తొలి రోజు బి.పి.ఇడ్. కోర్సుకు 531 మంది, డి.పి.ఇడ్. కోర్సుకు 190 మంది విద్యార్థులు హాజరయ్యారు. శారీరక సామర్థ్య పరీక్షల్లో పరుగులు, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ నిర్వహించగా, నైపుణ్య పరీక్షల్లో బాస్కెట్‌బాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు జరిగాయి. వ్యాయామ విద్య ప్రవేశ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

## అంగరంగ వైభవం రేణుక ఎల్లమ్మ జాతర



**హుస్నాబాద్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాకతీయుల కాలం నాటి చారిత్రక ప్రాధాన్యం కలిగిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నెల రోజుల పాటు జాతర ఘనంగా కొనసాగుతోంది. వైశాఖ పౌర్ణమి నుంచి జ్యేష్ఠ పౌర్ణమి వరకు గౌడ ధర్మకర్తల ఆధ్వర్యంలో శతాబ్దాల సంప్రదాయం కొనసాగుతోంది. జాతరలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఓడి బియ్యం పోయడం, బోనాలు సమర్పించడం, పట్నాలు వేసి బంధుమిత్రులతో భోజనాలు చేయడం ఆనవాయితీగా జరుగుతోంది. వారాంతాల్లో కూడా పెద్ద సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ప్రహరీ గోడ, విశ్రాంతి షెడ్లు, పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్స్, అన్నదాన మండపం, మినీ వాటర్ ట్యాంకులు వంటి అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. ఈ కార్యక్రమంలో శాశ్వత ధర్మకర్తలు, ఆలయ ఈవో పి. కిషన్ రావు, పూజారి తాటికొండ పరమేశ్వర్, ఆలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు. చారిత్రక వైభవానికి ప్రతీకగా ఎల్లమ్మ జాతర భక్తి వాతావరణంలో కొనసాగుతోంది.

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని డిమాండ్




**పెద్దపల్లి, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికి గుర్తింపు, గౌరవం, సంక్షేమం కల్పించే విధంగా ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ కావటి సతీష్ యాదవ్ కోరారు. జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉద్యమంలో విశేషంగా పనిచేసిన వారిని గుర్తించి సంఘంలో భాగస్వాములను చేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. జూన్ 21న హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం జరగనుందని, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉద్యమకారులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఉద్యమకారులకు తగిన న్యాయం జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. విద్యార్థులు, రైతులు, కార్మికులు, కళాకారులు, న్యాయవాదులు, పాత్రికేయులు తదితర వర్గాలందరికీ వివక్ష లేకుండా న్యాయం జరగాలని ఆయన కోరారు. 250 గజాల స్థలం, పెన్షన్, గుర్తింపు కార్డులు, ఆరోగ్య బీమా, ఉపాధి అవకాశాలు వంటి సంక్షేమ చర్యలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేపటి నుంచి పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉద్యమకారుల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రతి ఉద్యమకారి ఇందులో భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మొలుగూరి కమల్, అప్పనపేట మాజీ సర్పంచ్ అరె తిరుపతి, సామాజిక ఉద్యమకారుడు కొంకటి లింగమూర్తి, తెలంగాణ ఉద్యమకారులు కటకం హర్షవర్ధన్, గంగుల నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యమకారుల త్యాగాలకు తగిన గౌరవం, సంక్షేమం కల్పించడమే ప్రభుత్వ బాధ్యత అని సంఘం నేతలు స్పష్టం చేశారు.

## శాతవాహనలో కొత్త కోర్సులపై అవగాహన సదస్సు




**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన విశ్వవిద్యాలయంలో డిగ్రీలో కొత్త కోర్సులు, సిలబస్ రూపకల్పనపై అవగాహన సదస్సు అంబేద్కర్ లైబ్రరీ ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచేలా కొత్త కోర్సులను రూపొందిస్తున్నామని, పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం, ఇంటర్న్‌షిప్‌ల ద్వారా ప్రత్యక్ష అనుభవం కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉపకులపతి ఉమేష్ కుమార్ మాట్లాడుతూ, మల్టీడిసిప్లినరీ కోర్సులు, ఇంటర్న్‌షిప్ ఆధారిత పాఠ్యాంశాలు విద్యార్థులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. గౌరవ అతిథి హరికాంత్ మాట్లాడుతూ, రిటైల్, వాణిజ్య రంగాల్లో కొత్త ఉద్యోగాలు వస్తున్నందున వాటికి అనుగుణంగా కోర్సులు ప్రవేశపెట్టాలని సూచించారు. అకాడమిక్ ఆడిట్ సంచాలకుడు సరసిజ మాట్లాడుతూ, సైన్స్, ఆర్ట్స్, కామర్స్ కోర్సుల్లో సాంకేతిక, విలువ ఆధారిత కోర్సులు ప్రవేశపెట్టడం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు, విద్యా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థుల ఉపాధి అవకాశాలను పెంచేలా కొత్త కోర్సులు రూపకల్పన చేయాలని విద్యా మండలి స్పష్టం చేసింది.

## తెలంగాణ రక్షణ సేనలో భారీ చేరికలు



**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా శాతవాహన యూనివర్సిటీ జేఏసీ అధ్యక్షుడు చెన్నమల్ల చైతన్య, కాంగ్రెస్ నాయకురాలు గుగులోతు దివ్య, మాజీ వార్డ్ సభ్యుడు గుర్రం సత్యం గౌడ్, బిఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు లింగంపల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురు విద్యార్థి, యువజన, మహిళా నాయకులు హైదరాబాద్‌లో తెలంగాణ రక్షణ సేనలో చేరారు. జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కండువాలు కప్పి వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ప్రభుత్వం రైతు డిస్కం ఏర్పాటు చేసి మిగతా డిస్కంలను ప్రైవేటు చేయాలని చూస్తోందని, ఉచిత విద్యుత్ తొలగించి మోటార్లకు మీటర్లు పెట్టే ప్రయత్నం రైతులకు నష్టం చేస్తుందని విమర్శించారు. రైతు డిస్కం కు ఈఆర్సీ అనుమతి ఇవ్వొద్దని, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లి అడ్డుకుంటామని తెలిపారు. మా ప్రభుత్వం వచ్చిన తరువాత ఉచిత విద్య, ఉచిత వైద్యం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లాకావత్ రూప్ సింగ్, లింగంపల్లి నాగరాజు, మల్లారెడ్డి, బుడిగె పర్శారం గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బండ అశోక్, కొండపాక రాకేష్ రెడ్డి, సబ్బు నాగరాజు, నాగునురి రమేష్ చారి, పూజా తదితరులు పాల్గొన్నారు. రైతు సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వంశీచంద్ రెడ్డి



**ఆమనగల్లు, మే 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మండలం మాలేపల్లి గ్రామానికీ చెందిన కళ్ళు భాస్కర్ రెడ్డి సతీమణి అలువేలమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానీతులు చల్లా వంశీచంద్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. అధైర్య పడకండి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, సర్పంచ్ ప్రశాంతి రవికుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, సందమల్ల బొబ్బిలి తదితరులు ఉన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ జీతాల్లో ఈహెచ్‌ఎస్ కోతపై తపస్ ఆక్షేపణ




**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల మే నెల జీతాల్లో ప్రభుత్వం ముందస్తు సమాచారం లేకుండా ఈహెచ్‌ఎస్ ప్రీమియం మినహాయించడం తీవ్ర ఆక్షేపనీయమని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కరీంనగర్ జిల్లా శాఖ ఖండించింది. సంఘం అధ్యక్షుడు అన్నమనేని తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి జారతి నర్సయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా డీఏలు, పీఆర్సీలు, బకాయిలు చెల్లించని ప్రభుత్వం ఇప్పుడు ఏకపక్షంగా కోత విధించడం దారుణమని పేర్కొన్నారు. మినహాయించిన డబ్బులను తిరిగి ఖాతాల్లో జమ చేయాలని, ఉద్యోగ సంఘాలతో చర్చించి సమగ్ర నియమావళి రూపొందించి హెల్త్ కార్డులు జారీ చేసిన తర్వాత మాత్రమే మినహాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. ప్రభుత్వం ఏకపక్ష చర్యలను ఉపాధ్యాయ సంఘం తీవ్రంగా ఖండించింది.

## పుర ప్రముఖులకు ఆవోప సమక్షంలో ఘన సన్మానం



**కరీంనగర్, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోప) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రైవేట్ హోటల్‌లో పుర ప్రముఖులకు ఘన సన్మానం నిర్వహించారు. ఇటీవల మున్సిపల్ కార్పొరేషన్ కో-ఆప్షన్ మెంబర్‌గా ఎన్నికైన కన్న కృష్ణ, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ చైర్మన్ చిట్టిమల శ్రీనివాస్, శ్రమశక్తి అవార్డు గ్రహీత కొండూరి శ్రీనివాస్, ఆలయ ఉపాధ్యక్షులు గంజి స్వరాజ్ బాబు, తొడుపునురి దశరథం, డిసిసి లీగల్ సెల్ మీడియా కన్వీనర్ కొత్త ప్రకాశ్‌లను శాలువా కప్పి సన్మానించారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ వైశ్యులు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని, రాజకీయాలకు అతీతంగా సహకారం అందించాలని, దానధర్మం మాత్రమే కాకుండా రాజకీయాల్లో కూడా సత్తా చాటాలని సూచించారు. అనంతరం జమ్మికుంట ఆవోపతో పాటు పబ్బ అరుణను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కట్కూరి సుధాకర్, పట్టణ అధ్యక్షుడు నలుమచు సుదర్శన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. వైశ్యుల సేవా, రాజకీయ రంగాల్లో సత్తా చాటాలని సన్మాన గ్రహీతలు పిలుపునిచ్చారు.

## బడిబాట కార్యక్రమం విజయవంతం



**గంగాధర, మే 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని మల్లాపూర్, గోపాలరావుపల్లి గ్రామాల్లో బడిబాట కార్యక్రమం ఘనంగా జరిగింది. సర్పంచ్ కొలేపాక కవిత ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల ప్రవేశాలు చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు సలువాజీ నాగేశ్వరరావు, హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎనుగు ప్రభాకర్ రావు తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన విద్య, డిజిటల్ తరగతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం వంటి సౌకర్యాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని సౌకర్యాలతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని ఆయన తెలిపారు. గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు విశేషంగా స్పందించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రావడంతో బడిబాట కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి వివరించడంతో గ్రామాల్లో విద్యాపట్ల కొత్త చైతన్యం నెలకొంది.